


కారు డిక్కీ తెరిచి, జాకీ ఎత్తడానికి ఉపయోగించే ఇనపరాడ్ అందుకున్నాను. తిరిగి డిక్కీమూసి, డ్రయివింగ్ సీట్‌వేపు నడిచేను.

డోర్‌లాగి, ఆ రాడ్‌ని కాళ్ళదగ్గర, క్లచ్ - బ్రేక్ ఉండేచోట రెడీగాపెట్టేను. సెకెండ్ సీట్లో కూర్చుని ఎవ్వరయినా కిందికిచూస్తే, చీకట్లో అది కనిపించే అవకాశం లేదు.

తిరిగి డోర్ మూసి, రిస్టువాచీ చూసుకున్నాను. పాత డొక్కువాచీ అది. మసక చీకట్లో డయల్ సరిగా కనిపించి చావడం లేదు.

దుకాణాల్లో వెలుగుతున్న ట్యూబ్‌లైట్స్ వైపు తిరిగి చూసుకున్నాను. రాత్రి తొమ్మిదింబావు!

అది మోజంజాహి మార్కెట్ ప్రాంతం. రోడ్డు కిరుపక్కలా రకరకాల దుకాణాలు వున్నాయి. తొమ్మిది గంటలకి దుకాణాలు మూసేస్తారు గనక యజమానులూ- గుమాస్తాలు, నౌఖరులూ ఇళ్ళకివెళ్ళే ప్రయత్నంలో నిమగ్నమై వున్నారు.

అందరిలాగే మా యజమాని, సేఠ్ చందన్‌లాల్‌కూడా యింటికి వెళ్ళే ప్రయత్నంలో వున్నాడు. కాగితాలూ, ఫైళ్ళూ, డబ్బూ, నగలూ తన చిన్నసైజు బ్రీఫ్‌కేసులో సర్దుకుంటున్నాడు.

ఆ బజార్లో అతనికి పెద్దతాకట్టు దుకాణం వుంది. బాగానే సాగుతుంది వ్యాపారం. పగలంతా వచ్చేపోయే జనంతో సందడిగావుంటుంది.

నగా నట్రా, ఇళ్ళు వాకిళ్ళూ, పొలాలూ గాక, రిక్షాలు సయితం అక్కడ కుదువపెట్టుకోబడతాయి. మధ్యతరగతి జీవులకి అర్జంటుగా ఏం ముంచుకు వచ్చినా, సేఠ్ చందన్‌లాల్ ఆపద్బాంధవుడిలా కనిపిస్తాడు.

ఉదయం తొమ్మిది గంటలనుంచి రాత్రి తొమ్మిదిగంటల వరకూ వ్యాపారం చూసుకుని ఆరోజు పోగయిన వెండి బంగారు నగలూ, రిస్టువాచీలు, ప్రామిసరీనోట్లు, డబ్బూ గట్రా బ్రీఫ్‌కేస్‌లో సర్దుకుని కారులో ఇంటికి బయలుదేరుతాడు.

నేనతని కారు డ్రయివర్ని. అంతక్రితం తనే స్వయంగా కారు నడుపుకునే వాడతను. ఏడాది క్రితం అతని కుడికాలి మోకాల్లో బోన్ టి. బి. వచ్చి, ఆపరేషన్ జరిగింది.

ఆ కాలితో బ్రేక్ వత్తలేడు గనక, డ్రైవర్ కావాలని పేపర్లో ప్రకటిస్తే వచ్చి చేరేను. భోజనంపెట్టి వంద రూపాయలిస్తాడు. నా

నివాసం కారు గేరేజ్‌లోనే. ఇంకా పెళ్ళి జేసుకోలేదు. ఈ రోజుల్లో ఈ బ్రతుక్కి ఇహ పెళ్ళికూడానా!

బీడీ అంటించి, కారు మడ్‌గార్డ్ నానుకుని దుకాణంవైపు చూస్తున్నాను, ఆ రోడ్ రోలర్ ఎప్పుడు వస్తాడా అని.

కాసేపటికి షాప్‌కు తాళంవేశారు గుమాస్తాలు. చందన్‌లాల్ ఒక్కో తాళాన్నీ లాగి లాగిచూసి, సరిగ్గా వున్నాయన్నట్టు తలూపి మెట్లు దిగేడు.

అతని వెనకే ఇద్దరు గుమాస్తాలూ, ఓ నౌఖరూ దిగి సేఠ్‌కు నమస్కారాలుపెట్టి తలో దిక్కు వెళ్ళిపోయేరు. చందన్‌లాల్ గుండ్రాయి లాటి బొజ్జ ఊపుకుంటూ కారు దగ్గరికివచ్చాడు.

ఫ్రంట్ డోర్ తెరిచి పట్టుకొన్నాను.

అతి కష్టంమీద లోనికి దూరి, బ్రీఫ్‌కేస్ ఒళ్ళో పెట్టుకు కూర్చున్నాడు. డోర్‌మూసి డ్రైవింగ్ సీట్లో కూలబడ్డాను. సెల్ఫ్ స్టార్టర్ లాగి, గేర్‌మార్చి, కారు ముందుకు పోనిచ్చాను.

రాణీగంజ్ దగ్గరుంది అతని ఇల్లు.

లిబర్టీ టాకీసు దాటేక, ఓ విశాలమైన రోడ్డు వస్తుంది. ఆ రోడ్లో దుకాణాలూ అవీ ఏమీ వుండవు. లైట్ల వెలుతురూ అంతంత మాత్రమే!

రోడ్డు మధ్య నడుస్తున్న కారు స్పీడ్ స్లో జేసి, రోడ్డు పక్కకి తీసికెళ్ళి ఆపేను.

"ఏం జరిగింది?" అడిగేడు చందన్‌లాల్.

"ఫ్యూయల్ సరిగ్గా అందడంలేదు. ఏర్‌లాక్ అయిందేమో చూస్తాను." అన్నాను ఇంజన్ ఆఫ్‌జేసి.

"త్వరగా చూ డు. ఆకలవుతోంది." అన్నాడు.

కిందికి వంగి, చేత్తో తడుముతూ, అంత క్రితం అక్కడ రెడీగా పెట్టిన ఇనపరాడ్ అందుకున్నాను.

"ఏమిటది?" అడిగేడు చందన్‌లాల్.

"ఇదా? స్పేనర్!" అంటూ కణతమీద ఒక్కటి ఇచ్చేను,

చందన్‌లాల్ అ షాక్‌లోంచి తేరుకోక ముందే, శక్తికొద్దీ మరోటి ఇచ్చేను. ఉన్నట్టుండి అలా మెరుపు దెబ్బలు తీస్తానని అతను కలలో కూడా ఊహించి వుండడు. కిక్కురు మనకుండా తల పక్కకి వాల్చేశాడు.

రాడ్ కిందపెట్టి, కారు స్టార్ట్‌జేసి, వేగంగా ముందుకు పోనిచ్చేను. పావు గంటలో అతని ఇంటి కంపౌండ్‌లోకి తిప్పాను. కంపౌండ్ పక్కనే వుంది గారేజ్!

రివర్స్ గేర్‌వేసి, కారు గారేజ్‌లోకి తీసి కెళ్ళి ఆపేను. ఇంజన్ ఆఫ్ జెయ్యకుండా కారు దిగి, చందన్‌లాల్ కూర్చున్న వైపు వెళ్ళి, డోర్ తెరిచి, అతి కష్టంమీద అతన్ని కిందికి లాగేను. పిండి బస్తాలా దొర్లేడు. అతని ఒళ్లోంచి బ్రీఫ్‌కేస్ అందుకుని కార్లో పడేసేను.

గబ గబ గారేజ్ మూల వున్న ట్రంకు పెట్టెలో నా సామాను సర్ది, దాన్నికూడా కార్లో పడేసి, స్టీరింగ్ ముందు కూర్చున్నాను. కారు గారేజ్ బైటికి తీసి ఆపేను.

జాగ్రత్త కోసం చుట్టూ చూసేను, కారు శబ్దం విని ఇంట్లోంచి ఎవ్వరైనా బైటికివచ్చారా అని. ఎవ్వరూ కనిపించలేదు.


రెప్పపాటులో కారు దిగి, గారేజ్ తలుపులు మూసి, ఇవతల గడియపెట్టేను. మరి అరగంటవరకూ చందన్‌లాల్‌కు స్పృహరాదు ఆలోగా నేనీ పరిసరాల్లో ఉంటేగా!

కారెక్కి ముందుకు పోనిచ్చేను. గేటు దాటగానే ఎడంవైపు తిప్పి వేగం హెచ్చించేను. పావుగంట లోపల అమీర్ పేట్ జేరుకోవాలి. కారు లాగే నా మనసూ వేగంగా పరుగులు తీస్తోంది.

ఆ బ్రీఫ్‌కేస్‌లో లేదు లేదంటే, ఎనిమిది వేలకి తక్కువుండదు. అమీర్‌పేట్‌లో వున్న షాలిమార్ హోటల్ గదిలో తన సామానుతో సహా వచ్చి, నా కోసం ఎదురుచూస్తూంటుంది కౌసల్య!

ఆమె నక్కణ్ణించి తీసుకు, తిన్నగా బేగం పేట్ రైల్వే స్టేషన్ జేరుకోవాలి. నాంపల్లి స్టేషన్నించి బైలుదేరి పదిన్నరకి ఆ స్టేషన్లో ఆగుతుంది బొంబే ఎక్స్‌ప్రెస్.

అది క్యాచ్ చేశామంటే గండం గట్టెక్కినట్టే. చందన్‌లాల్‌కు స్పృహవచ్చి, పోలీస్




కంప్లయింట్ ఇచ్చినా, మా అయిపూ అజా ఉండేగా ఈ నగరంలో!

పూనా చేరుకుని, కౌసల్యని పెళ్ళి జేసుకోవాలి. ఈ డబ్బుతో ఏదైనా వ్యాపారం ప్రారంభించి సాఫీగా కాలం వెళ్ళబుచ్చాలి.

కౌసల్య!

ఈ జన్మలో మళ్ళీ కౌసల్యని చూస్తాననుకోలేదు నేను. హైద్రాబాద్‌వంటి ఈ విశాలమైన నగరంలో చాలా విచిత్రంగా, కాక తాళీయంగా మళ్ళీ కనిపించింది.

ఒకరోజు, ఏదో పనిమీద కార్లో పంజగుట్ట కాలనీ గుండా పోతున్నాను. ఉన్నట్టుండి రోడ్డు పక్కనించి పిల్లవాడి తోపుడు బండి తోసుకుంటూ రోడ్డు క్రాస్ జెయ్యబోతున్న అమ్మాయిని చూసి సడన్ బ్రేక్ వేసేను.

కిందామీదా చూడకుండా, అలా రోడ్డు కడ్డంగా వచ్చే వాళ్ళంటే నాకు వళ్ళుమంట. పైగా ఆ తోపుడు బండిలో చిన్న పిల్లాడుకూడా ఉన్నాడు.

"ఏయ్, అమ్మాయ్! కళ్ళు కనిపించడంలా?" అన్నాను గట్టిగా. అప్పుడు చూసింది ఆమె కారు వైపు.

ఆ పోలికలు అంతక్రితం ఎక్కడో చూసినట్టే తోచడంతో, కనుబొమలు ముడిచి ఇంకాస్త పరీక్షగా చూసేను.

ఆమెకూడా రెప్పవెయ్యకుండా నన్నే చూస్తోంది. పద్దెనిమిదేళ్ళ యువతి. గుండ్రని మొహం. చారడేసి కళ్ళు. అందంగా, పొందికగా ఎదిగిన అవయవాలు. రంగు వెలసినచీర. మాసిన రవిక!

సడన్‌గా పదేళ్ళు వెనక్కి వెళ్ళేయి నా జ్ఞాపకాలు. అప్పుడు మేము సూర్యాపేటలోవుండే వాళ్ళము. నా చిన్నతనంలోనే అమ్మ పోయింది. నాన్న నాయుడుగారి రైసుమిల్లులో పనిచేసే వాడు. అప్పుడు నాకు పన్నెండేళ్ళుంటాయి.

మా ఎదురింట్లోనే నారాయణమ్మ అనే ప్రౌఢ వుండేది. బి. డి. ఓ. గారింట్లో వంట మనిషిగా పనిచేసేది. ఆమెకి ఎనిమిదేళ్ళ ఓ కూతురుండేది. ఆ పిల్ల ఇంకా నారాయణమ్మ కడుపులో వుండగానే తండ్రిపోయేడుట.

ఆపిల్లే కౌసల్య!

ఎలకతోకల్లాంటి రెండుజడలూ, చింకిఫ్రాకూ చీమిడిముక్కూ ఎప్పుడూ దుమ్ముకొట్టుకుని వుండే పాదాలూ ఆ పిల్ల ప్రత్యేకతలు.

బడికెళ్ళి చదువుకోరా అని నాన్న యెంత పోరినా, వినకుండా ఆ పిల్లతో మట్టిలో ఆడు

కుంటూ, మామిడితోపుల్లోనూ, చింతతోపుల లోనూ, చెరువుగట్లవెంట తిరిగేవాణ్ని.

అలా నాకు పదమూడేళ్ళు నిండాయి. చదువు అబ్బక జులాయిలా తిరుగుతూ చెడిపోతున్నానని భయపడి, తెలిసిన ఓలారీ డ్రయివరుదగ్గర క్లీనర్‌గా కుదిర్చేడు నాన్న.

అలా కొన్నాళ్ళు లారీలవెంట తిరుగుతూ డ్రయివింగ్ నేర్చుకున్నాను. ఇంటికివెళ్ళినప్పుడల్లా కౌసల్యను చూడకుండా వుండలేకపోయేవాణ్ని.

ఒకరోజు అకస్మాత్తుగా నాన్న పోవడంతో ఆ ఊరికీ నాకూ ఋణం తీరిపోయింది. పొట్ట చేతపట్టుకుని హైద్రాబాదు వచ్చేను. క్రమంగా కౌసల్య జ్ఞాపకాలు నానించి చెదిరిపోయేయి.

అచ్చు అలాగే వుందే ఈ అమ్మాయి!

"కౌసల్యా!" అన్నాను పలుకుతుందో లేదో చూద్దామని.

ఆ అమ్మాయి ఉలిక్కిపడి "మాణిక్యం! నువ్వేనా?" అంది.

ఆనందంతో నా మనసు ఉరకలు వేసింది. కారు అలా రోడ్డుమధ్య ఆపినందుకు, వెనుక ఇతర వాహనాలు అరుస్తున్నాయి. వెంటనే కారు రోడ్డుపక్కకి తీసికెళ్ళి ఆపాను.

బండి తోసుకుంటూ మెరిసేకళ్ళతో నా పక్కకివచ్చింది కౌసల్య. ఆ బండిలోకూర్చున్న రెండేళ్ళ కుర్రాడు నన్నూ, కారునీ యెగాదిగా చూస్తున్నాడు.

మహాసాగరంవంటి ఈ నగరంలో,ఇన్నాళ్ళూ ఏ ఆత్మీయులూ లేక, ఏకాకిగా బ్రతుకుతున్నాను. ఊహించని విధంగా ఎదురైన ఆ చిన్ననాటి నేస్తాన్ని చూడగానే చెప్పలేని ఆనందంతో నాకు ఊపిరి అందలేదు!

"కౌసల్యా! హైద్రాబాద్ ఎప్పుడొచ్చారు? అమ్మ ఎలా వుంది? ఈ అబ్బాయెవరు?" అడిగేను ఏకబిగిన.

అంతవరకూ తళతళ మెరుస్తున్న కౌసల్య కళ్ళల్లో విషాదం చోటు జేసుకుంది. "ఏం చెప్పేది మాణిక్యం! ఏడాది క్రితం అమ్మ పోయింది. ఆ ఊళ్ళో నా బ్రతుకు దుర్భరమయింది. ఓ డాక్టరమ్మ ఇంట్లో పనికి కుదిరేను. ఆవిడ కేమద్యే ఇక్కడికి బదిలీ అయింది. వాళ్ళ ఇల్లు ఈ కాలనీలోనేవుంది. ఈ అబ్బాయి వాళ్ళ కొడుకే!"

నిట్టూర్చేను. "మనద్దరి జీవితాలు దాదాపు ఒకే కోవకి చెందుతాయి. వాళ్ళు జీతం ఏమిస్తారేమిటి?"

"భోజనం, బట్టలూ పోను, నెలకి నలభై రూపాయలిస్తారు."

"పెళ్ళి జేసుకున్నావా?"

సిగ్గుపడుతూ, లేదన్నట్టు తల విదిలించింది.

నేనెక్కడ పనిజేస్తున్నానో, ఎక్కడ వుంటున్నానో మొదలైన వివరాలుచెప్పి, ఆమె చిరునామా అడిగి, వచ్చే ఆదివారం ఫలానా చోట కలుసుకోమని చెప్పి వెళ్ళిపోయేను.

ఆదివారాలు చందన్‌లాల్ దుకాణం మూసి వుంటుంది. ఆరోజు అతను ఇంట్లోనే వుండి, వీక్లీ ఎకౌంట్స్ చూసుకుంటాడు. నాకూ అట్టే పని వుండదు, కారు మేంటినేన్స్ తప్ప!

చెప్పినట్టే, ఆదివారం నిర్ణీత ప్రదేశానికి వచ్చింది కౌసల్య. ఈసారి కాస్త స్నానం అదీచేసి, మంచి బట్టలు కట్టుకుంది. వదులుగా జడవేసుకుని, పిసరంత మల్లెచెండు తురుముకుంది.

ఎందుకోగానీ, ఆమెని చూడగానే నా మనసంతా అవ్యాజ్యమైన భావనతో నిండిపోయింది. ఆరోజు రీగల్ టాకీస్‌లో ఆడుతున్న తెలుగు పిక్చర్ చూశాం.

అలా ప్రతి ఆదివారం ఎక్కడో ఒకచోట కలుసుకునే వాళ్ళం. పబ్లిక్ గార్డెన్స్, జూలాజికల్ పార్క్, చార్మినార్, సాలార్జంగ్ మ్యూజియం ఇలా ఒక్కో ఆదివారం ఒక్కో ప్రదేశానికి తీసికెళ్ళి చూపేవాణ్ణి.

అలా కలుసుకుంటున్నా, మాలో అనురాగం తప్ప మరో హేయమైన భావం చోటు జేసుకోలేదు!

ఓ రోజు మధ్యాహ్నం, ఇరానీ హోటల్లో భోజనం జేశాక, మాటల మధ్య అడిగేశాను. "కౌసల్యా! మనం పెళ్ళి జేసుకుని దంపతులమైతే ఎలా వుంటుంది?" అని.

దాంతో కౌసల్య మొహం ముడుచుకు పోయింది.

"దేనికలా ఐపోయావ్?" అడిగేను అర్థం కాక.

కౌసల్య భారంగా నిట్టూర్చింది. "మాణిక్యం! నీవు నా మనసులోని మాట బైట పెట్టావ్. ఇప్పుడు నాకు పద్దెనిమిదేళ్ళు. మరో రెండేళ్లు పోతేగానీ, నేను పెళ్ళి చేసుకోలేని అశక్తురాలిని!"

"దేనికి!" అడిగేను ఆశ్చర్యంగా

"నేను మా అమ్మకి ఓ వాగ్దానం జేశాను."

"ఏమని?"

కౌసల్య నవ్వి— "నా పదేళ్ళప్రాయంలో మా అమ్మ ఓ సోది చెప్పే అమ్మికి నాచెయ్యి చూపించింది. ఆ అమ్మి, నన్ను ఇరవై యేళ్ళు నిండేవరకూ పెళ్లి జేసుకోవద్దనీ, నా పద్దెనిమిదో ఏట ఓ గండం వుందనీ, ఆ వయసులో గనక నా పెళ్ళైతే, నా భర్త ఏ దుర్ఘటనకో గురై మరణిస్తాడనీ చెప్పింది.

సరిగ్గా అటువంటి జోస్యమే, మా అమ్మ చిన్నతనంలో ఓ జ్యోతిష్కుడు ఆమె చెయ్యి చూసి చెప్పేడుట. మా అమ్మ తలితండ్రులు ఆ జోస్యాన్ని గాలికబుర్లకింద జమకట్టి, పదహారేళ్ళ వయసులోనే అమ్మ పెళ్ళి జేశారుట. ఫలితంగా, నేనామె కడుపులో వుండగానే నాన్న పోయాడు.

ఆ జోస్యాల సంగతెలా వున్నా, ఏడాది క్రితం అమ్మ మరణిస్తూ నా చేత ఓ ప్రమాణం చేయించింది. నే నెక్కడ వున్నా, ఎలా వున్నా, ఇరవై ఏళ్ళు నిండేవరకూ ఎట్టి పరిస్థితిలోనూ పెళ్ళి చేసుకోవద్దని. తనమాట కాదని నేను పెళ్ళి చేసునుంటే, తనలాగే నా జీవితమూ మోడు వారి పోతుందని ఆమె భయం!

ఆమె మాట శిరసావహిస్తానని, చేతిలో చెయ్యివేసి వాగ్దానం చేశాను. అందుకే, దయచేసి మరో రెండేళ్ళు ఓపిక పట్టు మాణిక్యం!" అంది ప్రాధేయపడుతూ.

నాకు నవ్వాగలేదు. "ఈ రాకెట్ యుగంలో ఇంకా ఆ పుక్కిటిపురాణాలు పట్టుకు వేళాడితే ఎలా? అత్యవసర పరిస్థితుల్లో కొన్ని వాగ్దానాలు తుంచి వెయ్యక తప్పదు కౌసల్యా! చచ్చిన వారికి బ్రతికున్న వారి ఇక్కట్లు ఎలా తెలుస్తాయి?"

"అలా అనక! తొందరపడి మనం పెళ్ళి చేసుకుంటే, దురదృష్టవశాత్తు మా అమ్మమాట నిజమై నీకేమైనా జరిగితే నేను జీవించగలనా? నాకోసం రెండేళ్ళు కాచుకోలేవా మాణిక్యం"

"రెం.... డేళ్ళు! మాటలా? అంతవరకూ ఎలా ఓపిక పట్టమంటావు కౌసల్యా! పైగా మా సేఠ్ ఇంట్లో పనిచేసే నౌఖరు తన కూతుర్ని చేసుకోమని ఒహటే పోరుతున్నాడు. నిజానికి ఆ అమ్మాయి ఎర్రగా బుర్రగా ఎంతో బావుంటుందనుకో.

కాని, నా మనసులో నీకు తప్ప మరొకరికి స్థానం ఇవ్వలేకపోతున్నాను. ఆ అమ్మాయి ఏదో ఓ వంకతో రోజూ నన్ను కలుసుకోడానికి వస్తుంటుంది ..." నేను వదిలిన బాణం బాగా పనిచేసింది.

కౌసల్య కళ్ళు ఈర్ష్యతో దహించుకు పోయేయి.

"ఐతే ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకుంటావా మాణిక్యం?"

"ఛ....ఛ! అలా అన్నానా!....ఐతే, పరిస్థితు లెప్పుడూ ఒకే విధంగా వుంటాయా కౌసల్యా?" అన్నాను ఆమె భావాలు చదవడానికి ప్రయత్నిస్తూ.

కౌసల్య మొహం నిండా విషాదం అలుముకుంది.


మరో పదిహేను రోజుల తరవాత మళ్ళీ ఎత్తేను పెళ్ళి ప్రసక్తి.

"రోజు రోజుకూ నాలో ఓపిక నశిస్తోంది కౌసల్యా! ఒంటరిగా, ఆ కారు షెడ్లో జీవితం దుర్భరంగా వుంది. ఒకరి తోడూ నీడా లేని బ్రతుకూ ఒక బ్రతుకేనా?

ఆ ఒంటరితనంలో రాత్రిళ్ళు షెడ్డు గోడలు కరవగానికే వస్తున్నట్టు తోస్తుంది. ఇలా ఎంతో కాలం ఆగనులే. నీ మూఢ నమ్మకాలు కట్టిపెట్టి, ఆ తంతేదో త్వరగా జరగనివ్వు."

కౌసల్య నవ్వి—"పెళ్ళి పెళ్ళి అని అలా దేవిర్లాడుతున్నావుగానీ, మన సంపాదన

## (వి) చిత్ర విజ్ఞానం



పొగత్రాగడం నిషేధించడానికి స్వీడన్ ప్రభుత్వం తీవ్ర చర్యలను తీసుకుంటున్నది. సిగరుట్లను ఎవరిళ్లల్లో వాళ్ల తలుపులు మూసుకుని కాల్చాల్సిందే. బైట సిగరెట్లతో ఎక్కడ కంటబడినా పోలీసులు వదిలిపెట్టరు. పైగా పొగ త్రాగడంవల్ల కలిగే హాని గురించి, రోజూ రేడియోల్లో, బళ్ళలో, కాలేజీల్లో, ఆస్పత్రుల్లో ప్రజలకు వివరించడం జరుగుతోంది. స్వీడన్‌లో ఎందుకూ పనికిరాని మామూలు సిగరెట్ ప్యాకెట్ ధర రూ. 13-70 పైసలు॥

---

విషయం ఆలోచించేవా మాణిక్యం? ఇప్పుడు చెరో చోట పనిచేస్తున్నాం గనకా, ఒంటరి వాళ్ళం గనకా వాళ్ళ దగ్గిరే ఇంత తిండీ, వుండడాని కింతచోటూ దొరుకుతున్నాయి.

రేపు పెళ్ళైతే, అలా వేరువేరుగా వుండలేం కదా? తప్పని సరిగా ఓ ఇల్లు అద్దెకి తీసుకోవాలి. ఈ మహానగరంలో ఇళ్ళు దొరకడం అటుంచి, వాటి అద్దెల సంగతి నీకు తెలిసిందే కదా? అది పోను, సంసారానికయ్యే సామానూ అదీ ఎలాగూ కొనక తప్పదాయె. రేపు పిల్లా జెల్లా పుడితే, మన పిడికెడు సంపాదనతో వాళ్ళనెలా పోషించేది? ఎలా పైకి తీసుకువచ్చేది? అవన్నీ శాంతంగా ఆలోచించేవా?" అంది.

తప్పించుకోడానికిదో సాకన్నమాట, అనుకుంటూ నవ్వేను. "కౌసల్యా! నీలాగే నేనూ అంతదూరం ఆలోచించే ఓ నిర్ణయానికివచ్చేను. నా దగ్గర ఓ పథకం వుంది. దాన్ని అమలు జరిపేమంటే మన జీవితాలు నిశ్చింతగా గడిచి పోతాయి!"

"ఏమిటా పథకం?'.

"మా సేఠ్ రోజూ రాత్రి తొమ్మిదిగంటలకి ఆరోజు పోగయిన డబ్బూ దస్కం బ్రీఫ్ కేస్‌లో పెట్టుకొని కార్లో ఇంటికి బయలుదేరతాడు. వాడు వడ్డీవ్యాపారి. బీదా బిక్కీ రక్తం పిండి, వేలకి వేలు సంపాదిస్తున్నాడు.

ప్రామిసరీ నోట్లలో ప్రభుత్వం నిర్ణయించిన వడ్డీరేటు చూపించి, దానికి రెండింతలు అప్పుల వాళ్ళదగ్గిర గుంజుతాడు. వాణ్ని మూర్ఛ పోగొట్టి ఆ బ్రీఫ్‌కేసు కాజేస్తాను. ఇద్దరం ఎక్కడికయినా వెళ్ళి పెళ్ళిచేసుకుని సుఖంగా బ్రతుకుదాం! ఏమంటావ్?"

"బాబోయ్! దొంగతనమే!" అందికౌసల్య గుండె అదుముకుని. "ఇది దొంగతనం ఎలా అవుతుంది కౌసల్యా? వాడు ఇతరులని దోచుకోడంలేదా? ఈ మాత్రం మనం వాణ్ని దోచుకుంటే తప్పేమిటి?"

"పట్టుబడితే ఇంకేమయినావుందా? దొరికే ఈ కాస్త మెతుకులూ గంగపాలు కావూ?" కౌసల్య కంఠం వణికింది.

"పిచ్చిదానా! ఇది చాలా తేలికయిన ప్లాను. పట్టుబడే ప్రసక్తిలేదు. వాణ్ని మూర్ఛపోగొట్టి బ్రీఫ్‌కేస్‌తో తిన్నగా షాలిమార్ హోటల్ చేరుకుంటాను. ఆలోగా నీవు నీ సామానుతో ఆ హోటల్లో నాకోసం కాచుకో.

నేను రాగానే ఇద్దరం బేగంపేట స్టేషన్ పోదాం. అక్కడ మనకి బాంబే యెక్స్‌ప్రెస్ అందుతుంది. ఆలోగా చందన్‌లాల్‌కు స్పృహ వచ్చి,పోలీస్ రిపోర్టు యిచ్చేవరకూ,వాళ్ళు వెదికే వరకూ మన ఛాయలే నగరంలో వుంటేగా?"

"నాకోసం అంతపెద్దనేరం చేస్తావామాణిక్యం?"

"దొంగతనమా? నీకోసం ఏం చేయడానికయినా నేను సిద్ధమే కౌసల్యా" అన్నాను ప్రేమ నిండిన స్వరంతో.

కౌసల్య పలకలేదు.

"ఊరికే ఆలోచించి మనసు పాడు చేసుకోక! రేపు సోమవారంకదా, రేపే ప్లాన్

అమలు జరపాలి. అర్థమయిందా?" అన్నాను.

మెల్లిగా తలూపింది కౌసల్య.

ఎదురుగా షాలిమార్ హోటలు కనిపించడంతో ఆలోచనలు చెదిరిపోయాయి. కారు స్పీడ్ స్లోచేశాను.

హోటల్‌కి కాస్త ఇవతల, మసకచీకట్లో ఆపి దిగాను. బ్రీఫ్‌కేస్ అందుకుని గబగబ హోటల్లోకి నడిచాను. చిన్న హోటల్ అది. అట్టే రష్‌వుండదు. పైన సింగిల్‌రూమ్స్ అద్దెకివ్వబడతాయి.

అంతక్రితం నేనే మారుపేరుతో ఓ రూమ్ తీసుకుని వుంచేను. ఈపాటికి కౌసల్య తన సామానుతో వచ్చి యెదురు చూస్తూంటూంది. గబగబ మెట్లెక్కి పైకి చేరుకున్నాము. మేము తీసుకున్న 6వ నెంబర్ గది తలుపుకి తాళం లేదు. అంటే కౌసల్య వచ్చివుంటుంది.

గదిముందాగి తలుపు తట్టేను. చెయ్యి పడగానే కిర్రుమంటూ తెరుచుకుంది. లోనికెళ్ళాను. గది ఖాళీ! ఎవ్వరూలేరు.

సరిగ్గా అదేక్షణంలో యెవ్వరో గదిలోకి వచ్చిన అడుగుల చప్పుడు విని చటుక్కున వెనుదిరిగేను. ఇద్దరు అపరిచితులు.

"మాణిక్యం నువ్వేనా?" అడిగాడొకడు.

"ఔను! మీరెవరు?"

అతను నవ్వి "సిటీ క్రయింబ్రాంచి పోలీసులం!" అన్నాడు నింపాదిగా.

నాగుండె గుభిల్లుమంది.

అతను నవ్వుతూ, "నీ నిర్వాకం యింత త్వరగా మాకెలా తెలిసిందా, అని ఆశ్చర్యపోతున్నావ్ కదూ?" అని జేబులోంచి మడతపెట్టిన ఓ కాగితంతీసి నావైపు చూపాడు,"ఇది ఉత్తరం! నీకోసం రాసిన ఉత్తరం. చదువు."

వణికే చేతులతో దాన్ని అందుకున్నాను.

"ప్రియమైన మాణిక్యం!

ఇలా చేసినందుకు నన్ను మనస్ఫూర్తిగా మన్నించగలవు. నీ మేలుకోరి బాగా ఆలోచించే ఇలా చేసాను. క్షమిస్తావు కదూ?

అటు నా తల్లికిచ్చిన వాగ్దానం తుంచివెయ్యలేను. ఇటు నిన్నూ వదులుకోలేను. నీలో సహనం తక్కువ! తొందరపడి ఇప్పుడే నన్ను పెళ్ళి చేసుకుంటే, నా తల్లిమాట నిజమై నీకు ఏమయినా అయితే నేనేమైపోను?

అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాను. చోరీ నేరంకింద నీకు కొద్దిరోజులు శిక్షపడుతుంది. ఆలోగా నా గడువూ పూర్తవుతుంది. జైల్లో వున్నంతకాలం నీవు మరొకరి సొత్తువైపోతావేమో నన్న భయమూ వుండదు!

ఒకరికిచ్చిన వాగ్దానంకోసం ఇంత కట్టుబడివున్న నేను ఎటువంటిదాన్నో నీవే వూహించుకో. పెళ్ళంటూ చేసుకుంటే నిన్నే చేసుకుంటానని నీకూ వాగ్దానం చేశానుకదా? దాన్ని కూడా నా కొనవూపిరి వరకూ నిలుపుకుంటాను.

నీవు విడుదలయ్యేవరకూ అభిసారికలా నీకోసమే ఎదురు చూస్తుంటాను. పోలీసులకు నీ గురించి చెప్పానని దయచేసి కోప్పడక.

ఇక వుంటాను.

ఎప్పటికీ

నీ కౌసల్య. □

